

భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయుడే

- కలెక్టర్ టీఎస్ చేతన్
- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీఓ, డీఈఓ

కొత్తచెరువు, సెప్టెంబరు 5: ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయుడేనని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండలంలోని జగరాశిపల్లి వద్దనున్న మంగళకర పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి విజయం వెనుక ఉపాధ్యాయుడి పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఉపాధ్యాయుడు ముందుగా పిల్లల వ్యక్తిత్వాన్ని గుర్తించి, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తారన్నారు. ప్రతి వ్యక్తి ఉన్నత శిఖరాలకు ఎదిగారంటే దానివెనుక గురువు పాత్ర ఉంటుందన్నారు. అలాంటి గురువును స్మరించుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ అని కొనియాడారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. తద్వారా ఉపాధ్యాయుల కొరత తీరనుందన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన 27 మందిని సన్మానించారు. జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఆర్డీఓ భాగ్యరేఖ, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, డిప్యూటీ డీఈఓ రంగస్వామి పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


రూ.15.20 లక్షల విరాళం ఇచ్చిన పరిశ్రమల యాజమాన్యాలు

పుట్టపర్తి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని పలు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొచ్చాయి. రూ.15.20 లక్షల సాయం అందజేశాయి. సూర్య రోషిణి లిమిటెడ్ రూ.3 లక్షలు, ఫ్యూయంగ్ ఆటోమేటివ్ రూ.2.3 లక్షలు, విగ్రో ల్యామినేట్స్, గోళాపురం పారిశ్రామిక వాడలోని శ్రీబాలహ కెమికల్స్, చిలమత్తూరులోని ఎంఎస్ టెక్స్‌పోర్ట్ సిండికేట్ లిమిటెడ్ రూ.2లక్షలు చొప్పున, శ్రీచౌడేశ్వరి పవర్‌లూమ్స్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఇండియన్ డిజైన్స్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.లక్ష చొప్పున, డెలాయిట్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ రూ.90వేలు అందజేశాయి. ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ప్రకటనలో తెలిపారు. వరద బాధితులను ఆదుకోవడానికి పరిశ్రమల యాజమాన్యాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఫోన్ నో పే!

సరికొత్త సైబర్ నేరం

నకిలీ ఫోన్ పే యాప్‌తో నగదు బదిలీ సక్సెస్ అయినట్లు మెసేజ్.. జమకాని నగదు.. లబోదిబోమంటున్న బాధితులు






బయటికెళ్తే జేబులో డబ్బు పెట్టుకుని వెళ్లేవారు చాలా తక్కువయ్యారు. ఫోన్ పే, గూగుల్ పే లాంటి యాప్‌ల ద్వారా చాలావరకు నగదు బదిలీ అవుతోంది. ఏ చిన్న దుకాణంలోకి వెళ్లినా స్కానర్లు ఉంటాయి. డబ్బు బదిలీ చేసి, అందుకు సంబంధించిన మెసేజ్‌ను కొట్టు నిర్వాహకుడికి చూపుతుంటారు. దానిని చూసి కొట్టు నిర్వాహకుడు ఓకే అని చెబుతుంటారు. ప్రస్తుతం అత్యధిక భాగం ఇలానే చెల్లిస్తున్నారు. ఇందులోనూ సరికొత్త మోసం వచ్చింది. ఏకంగా నకిలీ ఫోన్ పే యాప్‌ను సృష్టించారు ఆర్థిక నేరగాళ్లు. దాని ద్వారా నగదు బదిలీ సక్సెస్ అయినట్లు మెసేజ్ వస్తుంది. దానిని మోసగాళ్లు.. వ్యాపారులకు చూపుతున్నారు. దానిని నమ్మి వ్యాపారులు ఓకే చెప్పేస్తున్నారు. తరువాత చూసుకుంటే నగదు వ్యాపారి ఖాతాలో జమ అయి ఉండదు. తర్వాత చెక్ చేసుకుని, బదిలీ చేసిన వారి కోసం ఆరాతీసినా ప్రయోజనం ఉండట్లేదు. ఇలా జిల్లాలో చాలా మోసాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులూ జాగ్రత్త!



హిందూపురంలోని పేట వీధిలో రద్దీగా ఉండే ఓ బంగారు షాపులో 20రోజుల క్రితం గోరంట్ల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి రూ.40వేలకుపైగా బంగారు కొనుగోలు చేశాడు. రూ.20వేలు నగదు ఇచ్చి మరో రూ.20 వేలు ఫోన్‌పే ద్వారా పంపుతానన్నాడు. నగదు బదిలీ సక్సెస్ అయినట్లు చూపించి, వెళ్లిపోయాడు. వారం తరువాత బంగారు షాపు యజమాని గుర్తించి ఎవరెవరు ఫోన్‌పే ద్వారా చేశారో లిస్టును చూసుకుని మోసపోయినట్లు గుర్తించాడు. సదరు నంబర్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో చేసేదిలేక వదిలేశాడు.



బ్యాంకు ఖాతాలో బ్యాలెన్స్ చూపుతున్న దృశ్యం

ముద్దిరెడ్డిపల్లిలో పదిరోజుల క్రితం కర్ణాటక ప్రాంతానికి చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి రూ.50వేలదాకా చీరలు కొనుగోలుచేశారు. కొంత మొత్తాన్ని నగదు ఇచ్చాడు. మరికొంత మొత్తాన్ని స్కానర్ ద్వారా పంపారు. దానిని గమనించకపోవడంతో చీరలు తీసుకుని వెళ్లిపోయారు. రెండ్రోజుల తరువాత చీరల వ్యాపారి గుర్తించి మోసపోయినట్లు తన సన్నిహితుల వద్ద వాపోయాడు. వీరు మాత్రమే కాదు ఇలాంటివారు ఇటీవల కాలంలో చాలామంది మోసపోయారు. ఎక్కువ మొత్తంలో మోసపోయినవారు మాత్రమే బయటకు వస్తున్నారు. హిందూపురం పట్టణంలో ఎక్కడ చూసినా స్కానర్లు ఉంచారు. రూ.100, రూ.200కు ఎంత మంది మోసం చేస్తున్నారో తెలియదు. టీకొట్లు, హోటళ్లు, తోపుడు బండ్ల వద్ద మోసం జరిగినా పట్టించుకోరు.



రూ.40వేలు బదిలీ అయినట్లు చూపుతున్న నకిలీ ఫోన్ పే

హిందూపురం, సెప్టెంబరు 5: సరికొత్త సైబర్ నేరానికి కొంత మంది తెరలేపారు. నకిలీ ఫోన్ పే రంగంలోకి వచ్చింది. వస్తువు కొన్న తరువాత ఖాతాలో డబ్బు వచ్చినట్లు చూపుతుంది కానీ, రాదు. ఇది నకిలీ ఫోన్ పే మోసం. రాష్ట్ర సరిహద్దులో ఈ తరహా యథేచ్ఛగా సాగుతోంది. చాలామంది మోసపోతున్నారు. కొంతమంది ఖాతాబుక్కు అనే నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా వ్యాపారులు, ప్రజలను మోసగిస్తున్నారు. అధికంగా ఇలాంటి మోసాలు చిరువ్యాపారుల వద్దే జరగవచ్చు. దీంతో చిరు వ్యాపారులు దీనిపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసులు సూచిస్తున్నారు.



నిర్ధారించుకోండి..

ఖాతాలోకి నగదు బదిలీ అయినట్లు నిర్ధారించుకున్నాకే వినియోగదారులకు వ్యాపారులు వస్తువులు ఇవ్వాలి. వారు వెళ్లిపోయాక చూసుకున్నా ప్రయోజనం ఉండదు. నకిలీ ఫోన్‌పే ద్వారా ఎవరైనా నగదు బదిలీ చేశామని చెప్పి.. ఖాతాలో డబ్బు జమకాకపోతే అలాంటి వారి వివరాలు వెంటనే పోలీసులకు తెలపాలి. వ్యాపారులు దీనిపై అవగాహన పెంచుకోవాలి.

- డీఎస్పీ మహేష్, హిందూపురం

పరిగి మండలం సేవామందిరానికి చెందిన ఓ యువకుడు నిత్యం తన స్నేహితులతో కలిసి మద్యం సేవించడానికి సరిహద్దులోని ఓ వైన్ షాపునకు వస్తుండేవాడు. ఒకరోజు రూ.2వేలకుపైగా బిల్లు చేశాడు. స్కానర్ ద్వారా నగదు బదిలీ చేశాడు. ఆరోజు క్యాషియర్ స్థానంలో షాపు ఓనర్ ఉన్నాడు. అతడి నంబరే స్కానర్‌కు లింక్ చేసి ఉండటంతో అమౌంట్ పంపినట్లు చూపించాడు. ఆయన అప్పుడు కూడా గమనించలేదు. సదరు యువకుడు రూ.40వేలు నగదు కావాలని ఫోన్‌పే చేస్తాననడంతో నగదు ఇచ్చి ఆ మొత్తం తన ఖాతాకు బదిలీ చేయమన్నాడు. కొద్దిసేపటి తరువాత వైన్‌షాపు ఓనర్ ఫోన్‌పేలో బ్యాలెన్స్ చెక్ చేసుకోగా.. డబ్బు వచ్చినట్లు కనబడలేదు. దీంతో అనుమానం వచ్చి సదరు యువకుడిని పిలిపించి ఆరాతీయగా.. ఒప్పుకోలేదు. దీనిపై పోలీసులకు సమాచారం ఇస్తే వారి ముందు ఒప్పుకున్నాడు. మోసం చేసిన యువకుడికి కానిస్టేబుల్ అండ ఉండటంతో తప్పించుకోగలిగాడు.

అప్పు చెల్లించమన్నందుకు
దుకాణానికి నిప్పు




రూ.6 లక్షల నష్టం

కాలిపోయిన లడ్డూ దుకాణం

ధర్మవరం, సెప్టెంబరు 5: అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి చెల్లించమన్నందుకు తాను గతంలో పనిచేసిన దుకాణానికే నిప్పుపెట్టాడు ఓ ఘనుడు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న లడ్డూ దుకాణానికి బుధవారం రాత్రి నిప్పుపెట్టడంతో దహనమైందని నిర్వాహకుడు బాబ్జాన్ వాపోయాడు. అతడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లడ్డూ దుకాణంలో పనిచేసే షామీర్‌కు బాబ్జాన్ రూ.15 వేలు అప్పు ఇచ్చాడు. తరువాత షామీర్ పనికి రాలేదు. అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని బాబ్జాన్ అడిగాడు. ఈ నేపథ్యంలో కక్ష పెంచుకున్న షామీర్ బుధవారం రాత్రి లడ్డూ దుకాణంలోకి పెట్రోల్ పోసి, నిప్పంటించాడని బాధితుడు ఆరోపించాడు. దీంతో రూ.6 లక్షలు నష్టపోయినట్లు తెలిపాడు. వన్‌టౌన్ పోలీసులు దుకాణాన్ని పరిశీలించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడు షామీర్‌ను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది.

కృష్ణమ్మ వచ్చింది.. ఆనందం పంచింది..

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5: హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు గురువారం మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. శ్రీశైలం జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా జీడిపల్లి రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి గొల్లపల్లికి కృష్ణాజలాలు వచ్చాయి. రిజర్వాయర్‌కు ప్రస్తుతం 200క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. త్వరలోనే మూడు పంపుల ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 1.98టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.98 టీఎంసీల నీరు నిలువ ఉంది.



గొల్లపల్లి రిజర్వాయర్‌లోకి చేరుతున్న కృష్ణాజలాలు

ఏడాది తరువాత..

గొల్లపల్లి రిజర్వాయర్‌కు ఏడాది తరువాత కృష్ణాజలాలు చేరాయి. గతేడాది సెప్టెంబరులో నీటిని వదిలారు. ఆ తరువాత నీరివ్వకపోవడంతో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చొరవతో గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయించారు. రిజర్వాయర్‌కు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కియ, అనుబంధ పరిశ్రమలకు నీటి అవసరాలు తీరడంతోపాటు హిందూపురం తదితర పట్టణాలకు తాగునీటి కొరత లేకుండా పోతుంది.



సీజనల్‌గా వచ్చే వ్యాధుల్లో మలేరియా భయంకరమైనది. ఈ వ్యాధి పట్ల అవగాహన లేకపోవడం, జాగ్రతలు పాటించకపోతే మూల్యం చెల్లించుకోకతప్పదు. సీజనల్‌గా వచ్చే ఈ వ్యాధి నివారణకు చేపట్టాల్సిన చర్యలు ఇప్పటివరకు కానరాలేదు. ఇప్పటికే దోమల బెడద పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిద్రమత్తు వదలాల్సి ఉంది. దోమకాటు ద్వారా సోకే మలేరియాను నిర్లక్ష్యం చేస్తే నెలల తరబడి మనిషిని కుంగదీస్తుంది. సాధారణంగా వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా దోమల అభివృద్ధికి ఈ కాలం ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో దోమలను నివారించి, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- చిలమత్తూరు

కనిపించని అవగాహన కార్యక్రమాలు

- మాటలకే పరిమితమైన ఇంటింటి సర్వే
- దోమల నివారణ చర్యలు శూన్యం

మలేరియా ముప్పు!

అవగాహన కార్యక్రమాలేవీ?

సీజనల్‌గా దోమ కాటుతో వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యం చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు కనపడలేదు. దోమల నిర్మూలన, జ్వరాలతో బాధపడుతున్న వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు వంటివి నిర్వహించాలి. ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించాలి. ఇప్పటివరకు అటువంటి కార్యక్రమాలు చేసిన దాఖలాల్లేవనే చెప్పాలి. దోమల నిర్మూలన కోసం ప్రతి శుక్రవారం పాటించాల్సిన డ్రైడే గురించి ప్రజలకు వివరించాలి. డ్రైడే ద్వారా నీటి నిల్వలను ఖాళీ చేయడం, మురుగు నీటిని శుభ్రం చేయించడం, లార్వాలను నాశనం చేయడం చేయాలి. తద్వారా పుట్టిలోనే దోమలను నివారించవచ్చు. దోమల సంతతి విపరీతంగా పెరిగినా వాటి నిర్మూలనకు చర్యలు శూన్యమయ్యాయి. ఇళ్లలో దోమల నివారణకు ఫాగింగ్ తదితరాలు చేపట్టాలి. వాటి ఊసే లేదు.



పేరుకే ఇంటింటి సర్వే



సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి కాపాడేందుకు ఏఎన్ఎం, ఆశా, వలంటీర్లతో ఇంటింటి సర్వే చేయిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అటాంటి సర్వే ఎక్కడా జరగలేదని ప్రజలు వాపోతున్నారు. సాధారణంగా ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్యంతోపాటు జ్వరాలపై ఆరాతీయాలి. అసలే ఇప్పుడు మలేరియా, డెంగీ, టైఫాయిట్ వంటి విషజ్వరాల కాలం. ఇప్పటికీ అటువంటి సర్వే జరగకపోవడం గమనార్హం. మలేరియా పట్ల ప్రజలు అవగాహన చేసుకోలేకపోతున్నారు. తద్వారా వారు జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు క్లినిక్‌లకు వైద్యం కోసం వెళ్తున్నారు. అక్కడ వారు జ్వరమే కదా అనుకుని వైద్యం చేస్తున్నారు. దీంతో మలేరియా బలపడుతోంది. మలేరియా తీవ్రమై చివరికి ప్రాణాంతకమవుతోంది.

నిర్ధారణ ఇలా..

అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తారు. రక్త నమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణ అయితే మందులు ఇస్తారు. కొన్ని సందర్భాల్లో వైద్య సిబ్బందే ఇళ్ల వద్దకు వెళ్లి రక్తపు నమూనాలను సేకరించాలి. వ్యాధి నిర్ధారణ అయితే తప్పనిసరిగా వారికి మందులు అందజేసి, చికిత్సలు చేయాలి.

మలేరియా నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం



మలేరియా నివారణకు అన్ని చర్యలు చేపట్టాం. దోమల నివారణకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో ఫాగింగ్, మురుగునీటి నిల్వల తొలగింపు, లార్వా దశలోనే దోమలను నాశనం చేయడం తదితర చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మలేరియాపై సర్వే చేస్తున్నాం. బాధితులను గుర్తించి, వైద్యం అందిస్తున్నాం. ఎక్కడైనా కేసుల సంఖ్య పెరుగుతుంటే అలాంటి చోట వైద్య సిబ్బంది ద్వారా అప్రమత్తం చేస్తున్నాం. - డాక్టర్ కుళ్లాయినాయక్, జిల్లా మలేరియా అధికారి

వ్యాధి లక్షణాలు..

మలేరియా ఆడ ఎనాఫిలస్ దోమకాటు వల్ల వస్తుంది. చలి, వణకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం విడిచి విడిచి వస్తుండడం మలేరియా ప్రధాన లక్షణం. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి వ్యాధి పీడిస్తుంది. కొందరిలో సెరిబ్రల్ మలేరియా, వైవాక్స్ మలేరియా కూడా వస్తాయి. ఈ వ్యాధులు సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం, కామెర్లు పెరిగిపోవటం, న్యుమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవటం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. మలేరియా ఉన్న వ్యక్తి రక్తం ఎక్కించడం, వ్యాధి బారిన పడిన వ్యక్తిని కుట్టిన దోమ ఇతరులను కుట్టినా వ్యాప్తి చెందుతుంది.

మట్టి వినాయకులనే పూజించండి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, సెప్టెంబరు 5: మట్టి వినాయక విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం మట్టి వినాయక విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణానికి నష్టం కలగకుండా వినాయక చవితి చేసుకోవాలన్నారు. పూజలో మట్టి వినాయక విగ్రహాలనే వాడాలన్నారు. జిల్లా ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.



మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్

పండుగ ప్రశాంతంగా చేసుకోవాలి: ఎస్పీ

కదిరి, సెప్టెంబరు 5: జిల్లాప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. పట్టణంలో వినాయక మండపాల ఏర్పా ట్లు, రూట్ మ్యాప్‌ను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. వినాయక విగ్రహాలను ఊరేగించే కాలనీలు, నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. మసీదు వద్ద ముస్లిం మతపెద్దలతోపాటు హిందూవులతో మాట్లాడారు. నిమజ్జనం ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. పరిమితికి మించి ఎత్తైన విగ్రహాలు ఏర్పాటు చేయకూడదన్నారు. డీజేలాంటి వాటికి అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర మోహన్, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్ఐలు ఉన్నారు.




కదిరిలో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పత్రం.. పరమౌషధం

చవితి పూజలో వినియోగించే ఏకవింశతి పత్రాలన్నీ ఆరోగ్యానికి ఔషధాలే..

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 5: వినాయక చవితి భారతీయుల ప్రధాన పండుగల్లో ఒకటి. ఈ పండుగను భాద్రపద మాస శుక్ల చతుర్థి రోజున జరుపుకోవడం ఆనవాయితీ. గణేశ్ చతుర్థినాడు పూజల్లో 21 రకాల పత్రులతో గణనాథుడిని పూజిస్తుంటారు. ఇవన్నీ మహా శక్తివంతమైన దివ్య ఔషధాలు. ఈ పత్రులను వినాయక చవితి పండుగ రోజునే కాకుండా అనారోగ్య సమస్యల నివారణకూ వినియోగించుకోవచ్చును. ఈ పత్రులన్నీ ఏ అడవుల్లోనో పెరిగేవి కాదు, అన్నీ మన పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న మొక్కలే. నిమజ్జన సమయంలో ఈ పత్రులను నీటిలో వేయకుండా, వాటిని నీడలో ఆరబెట్టి పొడి చేసుకుని, మరికొన్నింటిని నీటిలో మరిగించి కషాయం తయారు చేసుకోవాలి. మనకు ఏదైనా అనారోగ్య సమస్య వచ్చినపుడు డాక్టర్ వద్దకు వెళ్లే పనిలేకుండా వాటిని సేవిస్తే అనారోగ్య సమస్యలు తొలగుతాయి. గణేశ్ చతుర్థిలో వినియోగించే 21 రకాల విశేష పత్రాల వివరాలు మీకోసం...



మాచీపత్రం (మాచిపత్రి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఆర్టీమీజియ పాలెన్స్. ఇది ఆస్టరేసి కుటుంబానికి చెందిన మొక్క. ఇది మంచి సువాసన గల పత్రి. దీనిని దద్దుర్లు, తలనొప్పి, వాత నొప్పులు, మధుమేహం, ఉబ్బసం, మూర్ఛవ్యాధుల నివారణకు వినియోగిస్తారు.

బృహతీపత్రం (వాకుడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం సోలానం సూరత్రేన్స్. ఇది సొలనేసి కుటుంబానికి చెందిన మొక్క. దీనిని దగ్గు, జలుబు, జ్వరం, మూత్ర వ్యాధులు, నేత్రవ్యాధుల నివారణకు వాడతారు.

బిల్వపత్రం (మారేడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఈదిల్ మార్మిలస్. ఇది రూటేసి కుటుంబానికి చెందినది. దీనిని జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్రవ్యాధులు, రక్తహీనత, పగుళ్లు, గాయాలు మానేందుకు వినియోగిస్తారు.

సింధూరపత్రం (వావిలాకు)



ఈ మొక్క శాస్త్రీయ నామం వైటెక్స్ నిర్గుండో. ఇది వెర్బినేసి కుటుంబానికి చెందిన వృక్షం. కీళ్ల నొప్పుల సమస్యలున్నవారు ఈ ఆకులు వినియోగించడం వలం మంచి ఫలితం ఉంటుంది.

చూతపత్రం (మామిడి)



ఈ మొక్క శాస్త్రీయనామం మాంజిఫెరా ఇండికా. ఇది అనకార్డియేసి కుటుంబానికి చెందిన మొక్క. నోటి దుర్వాసన, చిగుళ్ల వాపు సమస్యలను మామిడాకు బాగా తగ్గిస్తుంది. మామిడిపండ్లలో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

కరివీర పత్రం (గన్నేరు)



ఈ మొక్క శాస్త్రీయ నామం నెరియం ఒలియాండర్. ఇది అపోసైనేసి కుటుంబానికి చెందిన మొక్క. గడ్డలు, పుండ్లు, గాయాలు తగ్గేందుకు ఈ మొక్క వేరు, బెరడును ఉపయోగిస్తారు.

దాడిమీపత్రం (దానిమ్మ)



ఈ మొక్క శాస్త్రీయ నామం ప్యూనిక గ్రానేటం. ఇది ప్యూనికేసి కుటుంబానికి చెందినది. వాంతులు, విరేచనాలు అరికట్టడంలో దానిమ్మ ఆకులు బాగా పనిచేస్తాయి.

జాజిపత్రం (సన్నజాజి)



ఈ మొక్క శాస్త్రీయ నామం జాస్మినం ఆరిక్యూలేటం. ఇది ఓలియేసి కుటుంబానికి చెందినది. చర్మ సమస్యలు. సంబంధిత వ్యాధులకు ఈ ఆకులు ఔషధంగా పనిచేస్తాయి.

అర్జునపత్రం (తెల్లమద్ది)



ఈ మొక్క శాస్త్రీయ నామం టెర్మినేలియా అర్జున. ఇది కాంబ్రిటేసి కుటుంబానికి చెందినది. గుండెకు రక్త ప్రసరణను సులభతరం చేయడంతోపాటు అల్సర్లు, మధుమేహం, దగ్గు, ఉబ్బసం, చర్మవ్యాధుల నివారణకు ఈ ఆకులు ఉపకరిస్తాయి.

దూర్వారయుగ్మం (గరిక)



ఈ మొక్క శాస్త్రీయ నామం సైనోడాన్ డాక్టైలాన్. ఇది పోయేసి కుటుంబానికి చెందిన మొక్క. దీనిని గాయాలు మానడానికి, చర్మవ్యాధుల నివారణకు, ఉదర, మొలల సమస్యల నివారణకు వాడతారు.

తులసీపత్రం (తులసి)



శాస్త్రీయ నామం ఆసిమం శాంక్టమ్. లామియేసి కుటుంబానికి చెందిన మొక్క. రోగ నిరోధక శక్తిని పెంచి, రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు జలుబు, దగ్గును నివారించేందుకు ఈ మొక్క ఉపకరిస్తుంది.

మరువకపత్రం (మరువం)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఒరిగానం మజోరాన. ఇది లామియేసి కుటుంబానికి చెందినది. దీని ఆకులు సువాసనను వెదజల్లుతాయి. వీటి వాసన చూడడం వల్ల మనలో ఒత్తిడి వెంటనే తగ్గిస్తుంది.

దేవదారు పత్రం (దేవదారు)

ఈ మొక్క శాస్త్రీయ నామం సిడ్రస్ దియోధర. ఇది పైనేసి కుటుంబానికి చెందిన వృక్షం. వీటి ఆకులను తెచ్చి ఆరబెట్టిన తర్వాత ఆకులను నూనెలో వేసి కాచి చల్లార్చిన తర్వాత ఆ నూనెను తలకు రాసుకుంటే మెదడు, కంటి సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. దేవదారు వృక్షం నుంచి తీసిన నూనె చుక్కలను వేడి నీటిలో వేసి, ఆ నీటితో స్నానం చేస్తే శ్వాస సంబంధ సమస్యలు తొలగిపోతాయి.



దత్తూర పత్రం (ఉమ్మెత్త)



ఈ మొక్క శాస్త్రీయ నామం దత్తూర ఇనోక్సియా. ఇది సొలనేసి కుటుంబానికి చెందినది. దీనిని ఉబ్బసం, దగ్గు, శ్వాసకోస సమస్యలు, చర్మవ్యాధులతోపాటు కుక్కకాటు చికిత్సకు వినియోగిస్తారు.

అపామార్గ పత్రం (ఉత్తరేణి)



ఈ మొక్క శాస్త్రీయ నామం అఖిరాంథస్ ఆస్పెరా. అమరాంథేసి కుటుంబానికి చెందిన మొక్క. ఇది. దగ్గు, ఆస్తమా సమస్యల నివారణతోపాటు దంతాలను శుభ్రపరిచేందుకు ఈ మొక్కను వినియోగిస్తారు.

బదరీపత్రం (రేగు)



ఈ మొక్క శాస్త్రీయ నామం జిజిఫస్ మారిటియన. ఇది రామినేసి కుటుంబానికి చెందిన మొక్క. చర్మ సమస్యలు, మలబద్ధకం, విరేచనాల నివారణకు వాడుతారు.

విష్ణుక్రాంత పత్రం (నీలపుష్పి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఇవాల్వులస్ అల్సినాయిడిస్. ఇది కన్వాల్వలేసి కుటుంబానికి చెందినది. దీనిని నిద్రలేమి, దగ్గు, జ్వరం, విరేచనాలు, కడుపునొప్పి, గాయాలు మానేందుకు వినియోగించడం జరుగుతుంది.

గణికాపత్రం (కామంచి)



ఈ మొక్క శాస్త్రీయ నామం సోలానం వర్జినియానం. ఇది సొలనేసి కుటుంబానికి చెందిన మొక్క. దగ్గు, జ్వరం, తలనొప్పి, ఆస్తమా, అతిమూత్ర వ్యాధి నివారణకు ఈ మొక్క ఆకులు బాగా పనిచేస్తాయి.

శమీపత్రం (జమ్మి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ప్రసాఫిస్ సినరేరియా. ఇది మైమోసేసి కుటుంబానికి చెందిన వృక్షజాతి. నోటి సంబంధ వ్యాధులను తగ్గించడంలో జమ్మి పత్రం బాగా పనిచేస్తుంది.

అశ్వత్థపత్రం (రావి)



ఈ మొక్క శాస్త్రీయ నామం ఫైకస్ రెలిజియోస. ఇది మొరేసి కుటుంబానికి చెందిన వృక్ష జాతి. వీటి ఆకులను చర్మ నివారణకు వినియోగిస్తారు.

అర్కపత్రం (జిల్లేడు)



ఈ మొక్క శాస్త్రీయ నామం కెలాట్రోపీస్ జైగాన్టియా. ఈ మొక్క ఆకులను నరాల బలహీనత, చర్మవ్యాధుల నివారణకు వినియోగిస్తారు.

ఆరోగ్యపరంగా ప్రయోజనకరం



ఈ 21 రకాల ఔషధ మొక్కలను గణేష చతుర్థిరోజునే కాకుండా మానవ సంబంధిత అనారోగ్య సమస్యలకు సైతం డాక్టర్ వద్దకు వెళ్లే అవసరం లేకుండా ఔషధంగా వినియోగించవచ్చు. ఈ మొక్కల కషాయాన్ని లేదా మొక్కల పొడిని సేవించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– డాక్టర్ నాగిరెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్కేయూ

బౌలర్లదే హవా

తొలిరోజే 14 వికెట్లు
నిరాశపరచిన స్టార్లు
దులీప్ ట్రోఫీ మ్యాచ్



కిక్కిరిసిన స్టేడియం



అక్షర్ పటేల్



యువత.. కేరింత..

ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న అక్షర్ పటేల్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 5: నగరంలోని ఏసీజీ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమైన దులీప్ ట్రోఫీలో బౌలర్లు సత్తాచాటారు. ఇండియా సీ-ఇండియా డీ జట్ల మధ్య పోటీ సాగింది. ఇండియా సీ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా డీ జట్టు 164 పరుగులకే కుప్పకూలింది. బౌలర్లు విజయ్‌కుమార్ వైశాక్ 3, అన్షుల్ కాంబోజ్ 3, హిమాన్షు చౌహాన్ 2, మనవ్ సుతార్, హృతిక్‌షోకిన్ చెరో వికెట్ తీశారు. ఓపెనర్లు అతర్వటైడ్(4), యశ్‌దుబే(10) తక్కువ స్కోరుకే ఔటయ్యారు. తరువాత క్రీజ్‌లోకి వచ్చిన రిక్కీబూయ్(4), కేఎస్‌భరత్(13), శ్రేయాస్ అయ్యర్(9), శరాన్ష్‌జైన్(13) తక్కువ స్కోర్‌కే ఔట్‌కాగా దేవదత్ పడిక్కల్, హర్షిత్‌రాణా డకౌట్ అయ్యారు. అయితే 7వ నెంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగిన అక్షర్‌పటేల్ తొలుత నెమ్మదిగా ఆడినా తరువాత చెలరేగాడు. 118 బంతులను ఎదుర్కొన్న అక్షర్‌పటేల్ 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 86 పరుగుల చేసి జట్టును కీలక సమయంలో ఆదుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సీ జట్టు 91 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. తొలిరోజు ఆటముగిసే సమయానికి ఇంద్రజిత్ (15), అభిషేక్ పోరెల్ 32 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. జట్టు కెప్టెన్, ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులకే ఔటయ్యాడు. సాయిసుదర్శన్ 7 పరుగులు, ఆర్యన్ జుయల్ 12 పరుగులు, రజిత్ పటిదార్ 13 పరుగులకు పెవిలియన్‌బాట పట్టారు. ఇండియా డీ బౌలర్లలో హర్షిత్‌రాణా, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు.

కిక్కిరిసిన స్టేడియం

ఏసీజీ అభిమానులతో కిక్కిరిసింది. భారత జట్టు మేటి ఆటగాళ్లు ట్రోఫీలో ఆడుతుండటంతో చూసేందుకు యువత ఎగబడ్డారు. పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు. పాసులు ఉన్న వారిని మాత్రమే లోనికి అనుమతించారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, ప్రతినిధి సతీష్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు షాబుద్దీన్, పడగాల మల్లికార్జున, ఏజేపీ తీర్థ, సాయికృష్ణ, మచ్చా రామలింగారెడ్డి, పీఎల్ ప్రకాష్ రెడ్డి, మధు ఆచారి, మీడియా కోఆర్డినేటర్ తిమ్మప్ప, ఏసీఏ మీడియా మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అర్షదీప్ సింగ్ బౌలింగ్



డ్రింక్స్ బ్రేక్..

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తచెరువు, సెప్టెంబరు 5: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) దరఖాస్తు గడువును ఈనెల 17వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు దరఖాస్తులో విద్యార్థులు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. డీఎస్ఈ.ఏపీ. జీఓవీ.ఇన్‌లో కాని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొందవచ్చన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్‌డీ) నావిస్ హెచ్ ఆర్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన విద్యార్థులకు జపనీస్ బాష ఎన్ 5, ఎన్ 3 స్థాయిల్లో నేర్పించి ఆ దేశంలో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ నావిస్ హెచ్‌ఆర్ బెంగళూరులో ఆరు నెలలపాటు ఉంటుందన్నారు. ఉద్యో గ అవకాశం వచ్చిన వారికి సదుపాయాలను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నావిస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు చైతన్యకుమార్ రాజు 9398643930, టోల్‌ఫ్రీ నెంబరు 9988853335 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నీటి కుంటలో పడి విద్యార్థి మృతి

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 5: మండలంలోని రాయలప్పదొడ్డి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మణికంఠ (13) వ్యవసాయ తోటలో ఉన్న నీటికుంటలో పడి మృతిచెందాడు. గురువారం ఉదయం ఆ విద్యార్థి పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాలకు దూరంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలోకి బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ నుంచి నీటికుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. నీటికుంట వద్ద చెప్పులు ఉండటాన్ని గమనించిన మేకల కాపరులు సమీప తోటలో పనిచేస్తున్న కూలీలు, రైతులకు సమాచారాన్ని అందించారు. వారు వచ్చి చూసి గ్రామస్థులకు తెలియజేశారు. వారు అక్కడకు చేరుకుని మృతిచెందింది మణికంఠగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు మృతదేహాన్ని పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, సెప్టెంబరు 5: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3వేల టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

హాకీ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం, సెప్టెంబరు 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాకీజట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, జిల్లా జనరల్ సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాశ్ తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీ నుంచి 19వ తేదీవరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో 14వ పురుషుల జాతీయ జూనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు మహబూబ్‌బాషా, మహమ్మద్‌రఫీ ఎంపికయ్యారన్నారు. వీరిని బంధనాథం సూర్యప్రకాశ్‌తోపాటు సత్యసాయిజిల్లా గౌరవాధ్యక్షుడు బండవేణుగోపాల్, పల్లె ంవేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, మహమ్మద్ అస్లాం, కోశాధికారి అంజన్న, జాయింట్ సెక్రటరీ అరవింద గౌడ్, చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

ఎంపిక ప్రక్రియ పూర్తి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 5: అంబేడ్కర్ గురుకులాల్లో అదనపు సీట్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా పూర్తయినట్లు ఆ గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు సీట్లకు సంబంధించి 6, 7, 8వ తరగతులకు 561 దరఖాస్తులు రాగా 513 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. 8 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, డీసీఓ కార్యాలయంలోని నోటీసు బోర్డులలో ఎంపికైన విద్యార్థుల జాబితాను ఉంచడం జరిగిందన్నారు. 5వ తరగతి సీట్లకు సంబంధించి ఇదివరకు జరిగిన బ్రాగ్‌సెట్ ప్రవేశ పరీక్ష మెరిట్ జాబితాలోని తదుపరి విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆ విద్యార్థులు ఈనెల 9వ తేదీలోపు పాఠశాలల్లో చేరాలన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించండి

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు

కూడేరు, సెప్టెంబరు 5: సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ పథకాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికులు బుధవారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. వీరి సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపింది. పీఏబీఆర్ డ్యాంలోని ప్లాంట్ల వద్ద జరిగిన నిరసనలో ఓబులు, నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సత్యసాయి, శ్రీరామిరెడ్డి, సీపీడబ్ల్యూ పథకాలకు సంబంధించి 572 మంది, 600 మంది, 700 మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. పీఎఫ్ చెల్లించలేదని మండిపడ్డారు. ఆందోళన చేసిన సమయంలో హామీలు ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో పరిష్కారం కావడంలేదన్నారు. ఇటీవల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

సకాలంలో ఎరువులు

సరఫరా చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 5: జిల్లాకు కేటాయించిన మేరకు సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని పలు కంపెనీల ప్రతినిధులను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 111854 మెట్రిక్ టన్నుల పలు రకాల ఎరువులు కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటి దాకా 124865 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశారన్నారు. ఇందులో యూరియా 35467 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17145, ఎంఓపీ 10743, కాంప్లెక్స్ ఎరువులు 54789, ఎస్ఎస్‌పీ 6575 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయ్యాయన్నారు. ఈ నెలలో యూరియా, డీఏపీ సరఫరా చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో వరి, పప్పుశనగ పంటలు సాగు చేసే అవకాశం ఉన్నందున తగిన ఎరువులు సరఫరాను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ రవి, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి, టెక్నికల్ ఏఓ బాలూనాయక్, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి సవిత క్షమాపణ చెప్పాలి

ధర్మవరం, సెప్టెంబరు 5: రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చేనేత కార్మికులకు క్షమాపణ చెప్పాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకుడు వెంకటస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి చేనేతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించాల్సిన మంత్రి సవిత.. చేనేత కార్మికులను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. కావున మంత్రి చేనేత కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు అవసరమైన సబ్సిడీని విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.10 కోట్ల విరాళం

పుట్టపర్తి, సెప్టెంబరు 5: రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం తమవంతు సాయంగా రూ.10కోట్లు అందజేస్తున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పెన్షన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కుల మాధవ, సభ్యులు లింగారామ్మోహన్, లక్ష్మీనారాయణ, రామాంజినేయులు, పరమేశ్వరప్ప పేర్కొన్నారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో 10 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారని, వేతనాన్ని బట్టి రూ.750 నుంచి రూ.5వేల వరకు ఒకరోజు వేతనాన్ని ప్రభుత్వానికి అందజేస్తున్నామన్నారు. దాన్ని సీఎం సహాయ నిధికి పంపుతున్నట్లు తెలిపారు.

పింఛన్‌దారుల సాయం

కదిరి : వరద బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పింఛనర్ల సంఘం వారు ఒక రోజు పింఛన్‌ను విరాళంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి అందించినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 3.70 లక్షల మంది తరపున ఈ విరాళం అందించామన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


టాస్ వేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 5: ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మంత్రి సత్యకుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నీని గురువారం ప్రారంభించారు. బీజేపీ నాయకులు హరీశ్, మల్లికార్జున దీన్ని ప్రారంభించారు. అనంతరం గొట్లూరు, బడన్నపల్లి జట్లు తలపడగా ఐదు పరుగుల తేడాతో గొట్లూరు జట్టు, మేడాపురం, శివంపల్లి జట్లు తలపడగా 22పరుగుల తేడాతో మేడాపురం జట్టు, బసంపల్లి, కొత్తచెరువు జట్లు తలపడగా తొమ్మిది పరుగుల తేడాతో బసంపల్లి జట్టు విజయం సాధించింది. ఈ మూడు మ్యాచ్‌లలో గుట్లూరు వెంకటేశ్, మేడాపురం సమర, బసంపల్లి సోము క్రీడాకారులకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను దక్కించుకున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్

బత్తలపల్లి, సెప్టెంబరు 5: మండలంలోని రామాపురం సమీపములో గురువారం రాత్రి అక్రమంగా ఇసుసు తరలించడానికి ఉపయోగించిన మూడు ఎక్స్‌కవేటర్లు, రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. చిత్రవతి నది పరీవాహక ప్రాంతంలో ఇసుక తవ్వడానికి ఎటువంటి అనుమతులూ లేవని, ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

12 నుంచి క్రీడాపోటీలు

కదిరి అర్బన్, సెప్టెంబరు 5 : స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహిస్తామని మండల కన్వీనర్ వెంకటాచలం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో అండర్ 14, 17 బాలబాలికలకు కో-కో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, చెస్, యోగా తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

వాహనాలకు అనుమతి లేదు

ధర్మవరం, సెప్టెంబరు 5: వినాయకచవితి సందర్భంగా పట్టణంలోని పీఆర్‌టీ సర్కిల్ నుంచి అంజుమన్ సర్కిల్ వరకు వాహనాలకు అనుమతి లేదని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు వాహనాలకు అనుమతి లేదని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌కో విజిలెన్స్ ఆరా

గాండ్లపెంట, సెప్టెంబరు 5: మండంలోని పలువురు రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల కోసం రూ.లక్షలు వెచ్చించినా నెలల కొద్దీ నిరీక్షిస్తున్నారు. అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెబితే వెంటనే కనెక్షన్ ఇస్తున్నారు. దీనిపై కాసులిస్తేనే కరెంటు అనే వార్తను గత నెల 28న ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రచురించింది. స్పందించిన అనంతపురం ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు గురువారం మండలంలోని మల్లమీదపల్లి, వేపరాల, వంకపల్లి, కత్తివారిపల్లి చిన్నక్కగారిపల్లి, తదితర గ్రామాల్లో పర్యటించారు. రైతులతో ఆరాతీశారు.

ఆగని దందా..!

- రేషన్ బియ్యం మాఫియా
- సంచులు మార్చి.. కల్తీ చేసి.. విక్రయం
- కదిరి కేంద్రంగా వైసీపీ హయాంలో ప్రారంభం
- కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్న వైనం
- రూ. కోట్లు గడిస్తున్న అక్రమార్కులు


కుమ్మరవాండ్లపల్లిలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

కదిరి అర్బన్, సెప్టెంబరు 5 : జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం మాఫియా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకొంది. బియ్యాన్ని ఎల్లలు దాటిస్తూ ఆ పార్టీ సానుభూతిపరులు రూ. కోట్లు గడించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ మాఫియా యథేశ్చగా తన కార్యకలాపాలను కొనసాగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రేషన్ మాఫియాకు అడ్డుకట్ట పడుతుందని అందరూ భావించారు. అయితే రేషన్ దందా ఏ మాత్రం తగ్గలేదు. నేటికీ యథేశ్చగానే నడుస్తోంది. వైసీపీ సానుభూతి పరులు తమ అక్రమాలను కొనసాగిస్తూనే ఉన్నారు.

పెద్దఎత్తున నిలువలు

కదిరిలో చాలా చోట్ల పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమంగా నిలువ చేస్తున్నారు. 55 క్వింటాళ్ల బియ్యం ఇటీవల కుమ్మర వాండ్లపల్లిలో గోడౌన్‌లో బయట పడడమే ఇందుకు నిదర్శనం. పట్టణంలో రేషన్ అక్రమ వ్యాపారం చేసేవారిలో వైసీపీ సానుభూతి పనులే ఎక్కువ మంది ఉన్నారు. కొన్ని రైస్ మిల్‌లో అక్రమ దంగా కొనసాగిస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం ద్వారా నెలవారీ రూ. కోట్లల్లో ఆదాయం వస్తుండడంతో అందరూ దానిపై దృష్టి సారిస్తున్నారు.

బియ్యం సేకరణలో దళారులు

బియ్యం పంపిణీ ప్రారంభం కాగానే అక్రమార్కులు దళారులను రంగంలోకి దింపుతారు. ప్రత్యేకంగా కొంత మంది కూలీలను ఏర్పాటు చేసుకుని, ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యం కేజీ రూ.15 నుంచి రూ.17 వరకు సేకరిస్తున్నారు. వాటిని ఒకచోట చేర్చి, ఆటోలు, ట్రాక్టర్, లారీల ద్వారా రహస్య ప్రాంతాలకు తరలించి నిలువ చేస్తున్నారు. కొన్ని చోట్ల దుకాణాల్లోనే లబ్ధిదారులకు నగదు ఇచ్చి బియ్యాన్ని కొంటున్నారు.

అక్రమ వ్యాపారం

ప్రభుత్వం రాయితీతో ఇచ్చే బియ్యం కోసం ఎదురు చూసే పేదలు చాలా మంది ఉన్నారు. ఇచ్చే బియ్యం నాణ్యంగా లేవని, ఇతర కారణాలతో మరికొంతమంది వాటిని తినడానికి ఇష్టపడడంలేదు. వీరంతా తమకు వచ్చిన బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి కొనుగోలు చేసి, ఆ బియ్యాన్ని గోడౌన్లు, ఇళ్లవద్ద నిలువ ఉంచి రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. ఇదే బియ్యాన్ని సన్నబియ్యంతో కలసి ప్యాకింగ్ చేసి, సాధారణ బియ్యంలా విక్రయిస్తున్నారు. రైస్ మిల్‌లో పట్టుబడిన బియ్యం అంతా పాలిస్ చేసేందుకే అని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. రేషన్ బియ్యం రీసైకిలింగ్ చేసి నియోజకవర్గంలోనే రూ.లక్షల్లో దండుకొంటున్నారు. ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే అయినా.. అడ్డుకట్ట వేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు భూమిపూజ


పుట్టపర్తిలో పైపులైన్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

పుట్టపర్తి సెప్టెంబరు 5 : స్థానిక బస్ డిపో వెనుక గుట్టకాలనీలో రూ.9.52 లక్షలతో తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పైప్‌లైన్ ఏర్పాటు వల్ల బ్రహ్మణపల్లి, కర్ణాటక నాగేపల్లి, రాయలవారిపల్లి, ఎన్టీఆర్ కాలనీల్లోని ప్రజలకు రక్షిత తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. జగనన్న కాలనీలను ఎన్టీఆర్ కాలనీలుగా మారుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. కొత్తచెరువులో అన్నక్యాంటీన్ నిర్మాణానికి రూ.58 లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామని అన్నారు. పబ్లిక్‌హెల్త్ ఈఈ నరసంహమూర్తి మాట్లాడుతూ... పాడైపోయిన పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, మున్సిపాల్ చైర్మన్ వంగ ఓబులపతి, కమిషనర్ ప్రహల్లాద, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కొత్తచెరువు : ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులను తన దృష్టికి తీసుకొస్తే.. వాటికి నిధులు కేటాయిస్తామన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధులను అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెనుకొండ రహదారిలోని లే అవుట్‌కు రహదారి లేదని, తలమర్లలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు.

ఐకేపీ కార్యాలయం తనిఖీ

కొత్తచెరువులోని ఐకేపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తనిఖీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట జిల్లా అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు, కన్వీనర్లు అడపాల రామక్రిష్ణ, ఒలిపి శీన ఉన్నారు.



పుట్టపర్తి హనుమాన్ సర్కిల్లో, తాడిమర్రి సత్యసాయి పంప్‌హౌస్ వద్ద కార్మికుల నిరసన

కొనసాగిన సత్యసాయి కార్మికుల నిరసన

పుట్టపర్తి సెప్టెంబరు 5 : తమకు జీతాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని సత్యసాయి జిల్లా వాటర్ ప్రాజెక్టు కార్మికులు గురువారమూ తమ నిరసనను కొనసాగించారు. స్థానిక హనుమాన్ సర్కిల్లోని వాటర్ ట్యాంకు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రీన్ భారత్ ఫౌండేషన్ శంకర్‌నారాయణ కార్మికులకు మద్దతుగా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి వెంకటేష్, కార్మిక నాయకులు మురళి, మధు, నాగరాజు, ప్రభు, చంద్ర, రవి పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక పంప్‌హౌస్ వద్ద సత్యసాయికార్మికులు గురువారం నిరవధిక సమ్మెను కొనసాగించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హై ఓల్టేజీతో కాలిపోయిన ఎలక్ట్రికల్ వస్తువులు

కొత్తచెరువు, సెప్టెంబరు 5 : స్థానిక పసలమంద, కమ్మపాళ్యం వీధుల్లో హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో గురువారం పలు ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. ఈ రెండు కాలనీల్లోని దాదాపు 60 ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మిషన్లు, మోటార్లు తదితర వస్తువులు కాలిపోయాయి. రూ. లక్షల్లో నష్టం వాటిల్లింది. కొద్ది రోజులుగా హై ఓల్టేజ్ సమస్యతో తాము ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించాలని, లేకుంటే ట్రాన్స్‌కో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

దీనిపై ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్‌నాయక్ వివరణ కోరగా.. కోతులు బెడద ఎక్కువగా ఉందని, విద్యుత్ స్తంభాలను గట్టిగా ఊపడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. న్యూట్రల్ వైరు తెగి వైర్లపై పడటంతో అధిక ఓల్టేజ్ సరఫరా అయిందని, దీంతో షార్ట్‌సర్క్యూట్ అయిందని, ప్రజల నుంచి ఫిర్యాదు రావడంతో వెంటనే వెళ్లి సమస్యను పరిష్కరించామని తెలిపారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

కదిరి, సెప్టెంబరు 5: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ ఏడీ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు వ్యవసాయాధికారులు ఇవ్వాలని సూచించారు. ఏడీ మాట్లాడుతూ... 2024 ఖరీఫ్, రబీ ముగిసేంత వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈనెల 10 నుంచి ప్రత్యామ్నాయ పంట విత్తనాలైన ఉలవలను 80 శాతం సబ్సిడీతో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాసరెడ్డి, షాదాబ్, లక్ష్మీప్రియ, భారతి, పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

8న హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కదిరి అర్బన్, సెప్టెంబరు 5 : జిల్లా హ్యాడ్‌బాల్ జట్టును ఆదివారం ఎంపిక చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, స్టడీసర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. వివరాలకు 91103 32402ను సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

అధికారుల తీరుపై సభ్యులు ధ్వజం

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 5 : 'గత సమావేశాల్లో అనేక సమస్యలను ప్రస్తావించాం. ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అలాంటప్పుడు ఈ సమస్యలను నిర్వహించడం ఎందుకు.. సమయం వృథా..' అని అధికారుల తీరుపై సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ బి. శ్రీనివాసులు మండిపడ్డారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తుమ్మల ఫర్వీన్ షామీర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ముంపునకు గురై మరణించిన వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభం కాగానే.. సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. అన్ని కార్యాలయాలు మండల కేంద్రంలో ఉండాల్సి ఉండగా.. ఐసీడీఎస్ కార్యాలయం మాత్రం మహమ్మదాబాద్ క్రాస్‌లో నిర్వహించడం ఏమిటని సూపర్‌వైజర్ విజయకుమారిని ప్రశ్నించారు. మహమ్మదాబాద్ క్రాస్‌లో కార్యాలయం పెట్టడం వలన నల్లమాడ, ఓడీచెరువు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందిగా మారిందన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని ఖాళీగా ఉన్నాయని, వాటిని పరిశీలించి అక్కడ పెట్టాలని, లేదా అక్కడించే అద్దెతోనే ఇక్కడ ప్రైవేటు భవనం తీసుకోవాలని అన్నారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తతామని సూపర్‌వైజర్ సమాధానమిచ్చారు. పంచాయతీలో చాలా మంది ఎన్నరీ అసిస్టెంట్లు సరిగా పనిచేయడంలేదని ఏఓ రామసూరారెడ్డికి ఎంపీడీఓ వరలక్ష్మీ ఫిర్యాదు చేశారు. వెంకటాపురంలో విద్యుత్ లైన్‌మన్ సరిగా పనిచేయలేదని, కనీసం వీధిదీపాలు కూడా వేయలేదని, అత నిపై చర్యలు తీసుకోవాలని ఎంటీపీసీ శ్రీనివాసులు కోరారు. ఆర్ఐ, పీఆర్‌జేఈ, ఎస్ఐ పోస్టులు భర్తీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతి

ధర్మవరం, సెప్టెంబరు 5: నూతన చేనేత పట్టు, సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని చేనేత జౌళిక శాఖ ఏడీ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 50 మంది చేనేత, పట్టు కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో 50 మంది కంటే తక్కువగా ఉన్న చేనేత పట్టు సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ సంఘాల ఏర్పాటు వల్ల చేనేత సంఘం సభ్యులు ఉత్పత్తులను జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రదర్శనలో అమ్ముకునే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఆప్కో, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి అర్డర్లు పొందే అవకాశం ఉంటుందన్నారు. చేనేత పట్టు కార్మికులకు షేరు ధనం ఒక్కొక్కరు రూ.1000 చొప్పున సంఘం సభ్యత్వం రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకి రుణం పొందవచ్చన్నారు. కావున సంఘం ఏర్పాటుకు ప్రతిపాదనలు సత్యసాయి జిల్లాకేంద్రంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

హంద్రీనీవా కాలువ గండికి మరమ్మతులు



పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5 : జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయడంతో హంద్రీనీవా కాలువ గండికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు హెచ్ఎన్ఎస్ అధికారులకు సూచించారు. మండలంలోని కోనాపురం సమీపంలో మడకశిర బ్రాంచ్ కెనాల్ ఎల్-5 వద్ద వైసీపీ పాలన లో హంద్రీనీవా కాలువకు పడిన గండి టీడీపీ నాయకులు, హెచ్ఎన్ఎస్ అధికారులు గురువారం పరిశీలించారు. గండిపడిన ప్రదేశం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో 2023లో బీఎల్ఆర్ ప్రాజెక్ట్‌వారు నాశిరకంగా పనులు చేయడంతో హంద్రీనీవా కాలుకు గండిపడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మరమ్మతులకు రూ.9లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు నీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ డీఈ రామచంద్రమూర్తి, ఏఈ చౌడయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరంలో అవార్డు గ్రహీత ఉపాధ్యాయులకు సన్మానం


శ్రీసాయి డిగ్రీ కళాశాలలో కేక్‌కట్ చేస్తున్న సిబ్బంది


సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో సర్వేపల్లికి నివాళి

ఘనంగా గురుపూజోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా కేంద్రం, నియోజకవర్గాల కేంద్రాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. ధర్మవరం మున్సిపాలిటీ, మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకొన్న వారిని ఆర్డీఓ కార్యాలయంలో సన్మానించారు. పలు పాఠశాలల్లో టీచర్లను సన్మానించారు.


ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


నంబులపూలకుంటలో ఉపాధ్యాయులకు సన్మానం


ముదిగుబ్బ విశ్వభారతి పాఠశాలలో గురువులకు సన్మానం


కదిరిలో స్పేస్ కళాశాలలో సన్మానం


బ్లూమూన్ పాఠశాలలో ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల చైర్మన్ శివశంకర్

కమిషనర్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శ్రీనివాసులు

పెనుకొండ, సెప్టెంబరు 5: నగర పంచాయతీ కమిషనర్‌గా శ్రీనివా సులు గురువారం బాధ్యతలు స్వీకరించా రు. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న వంశీకృష్ణ భార్గవ్ కళ్యాణదుర్గానికి బదిలీకాగా ఆ యన స్థానంలో గుత్తి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు బదిలీపై పెనుకొండకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను కార్యాలయం మేనేజర్ నరసింహులు, సిబ్బంది, పుర ప్రముఖులు, పాలకవర్గ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు: సీఐ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 5: వివిధ ప్రాంతాలకు ఆటోలో వెళ్లే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని సీఐ రాఘవన్ ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. అధిక లోడ్‌వేసి ప్రమాదాలకు కారకులు కాకూడదన్నారు. ఇప్పటికైనా నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

శిథిలావస్థ భవనాలను గుర్తించండి: తహసీల్దార్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 5: మండలంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించాలని తహసీల్దార్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. తమతమ పరిధి లో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ, పాఠశాలలు తదితర ప్రభుత్వ భవనాలను గుర్తించి నివేదిక అందించాలని తెలిపారు. వాటిని ఉన్నతాధి కారులకు పంపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం మరమ్మతుల పరిశీలన

పెనుకొండ, సెప్టెంబరు 5: పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బీసీ బాలుర హాస్టల్ కోసం ఎంపిక చేసిన భవన మరమ్మతు పనులను టీడీపీ నాయకులు గురువారం పరిశీలిం చారు. టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు రమణమ్మ, శరణ్య, సుబ్రహ్మణ్యం చిన్నరాయుడు, సోము, గోపాల్ తదితరులు పరిశీలించారు. స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న భవనాన్ని డిగ్రీ విద్యార్థుల హాస్టల్ కోసం ఎంపిక చేశారు. దాని మరమ్మతు పనులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సూచనల మేరకు నాయకులు పరిశీలించారు.

నేడు ఎంజేపీ పాఠశాలను ప్రారంభించనున్న మంత్రి

పెనుకొండ టౌన్: మండలంలోని రాంపురంలో నిర్మించిన మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలను బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చేతులమీదుగా శుక్రవారం ప్రారంభిస్తారని టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. మంత్రి ఉదయం 9-30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి నాయకులు తరలిరావాలని కోరారు.

సీఎం సహాయనిధికి విరాళం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5: రొద్దం మండలంలోని సచివాలయం సిబ్బంది ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని అందించారు. విజయవాడ వరద ప్రభావిత బాధితుల సహాయార్థం రూ.27వేలు సేకరించి జిల్లా కలెక్టర్ చేతన్‌కు గురువారం సచివాలయ సిబ్బంది అప్పగించారు. డీపీఓ విజయ్‌కుమార్ సమక్షంలో ఈ నగదును అందించినట్లు వారు తెలిపారు.

వైసీపీ వక్కలిగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగేగౌడ్



మడకశిరటౌన్, సెప్టెంబరు 5 : వైసీపీ కుంచిటిగ వక్కలిగ రాష్ట్ర అధ్యక్షుడిగా నియో జకవర్గానికి చెందిన జీ రంగేగౌడ్‌ను నియ మించారు. రాష్ట్ర కమిటీల ఆపార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. రంగేగౌడ్ ఎంపికపై నియోజకవర్గం వైసీపీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వాల్మీకి కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పి రామచంద్ర



హిందూపురం: వైసీపీ అనుబంధ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పొగాకు రామచంద్రను నియమిస్తూ పార్టీ అదిష్టానం ఉత్తర్వులు జారీచేసింది. వైసీపీ హయాంలో వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన పొగాకు రామచంద్రను నియమిం చడంపట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అనంత రైతు స్థితిగతులపై 'సేద్యం'

గోరంట్ల, సెప్టెంబరు 5: ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో వ్యవ సాయ స్థితిగతులు, రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తున్న పరిస్థితు లు, లాభసాటి సాగు మెలకులవలపై సేద్యం చిత్రాన్ని రూపొందిం చినట్లు గోరంట్లకు చెందిన నిర్మాత జీఎం సురేష్ తెలిపారు. చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ఆయన గురువారం గోరంట్లలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ధర్మవరానికి చెందిన పసుపులేటి చంద్రకాంత్ దర్శకత్వంలో డీఓపీ విష్ణు, కొరియో గ్రాఫర్‌గా వినోద్‌తో కలిసి రాయలసీమ రైతుల ఇతివృత్తంపై సినిమా తీశామన్నారు. యూట్యూబ్ చానల్స్‌లో శుక్రవారం సాయంత్రం విడుదలయ్యే చిత్రాన్ని ప్రజల చూడాలని కోరారు.

చాకర్లపల్లిలో వైద్య బృందం పర్యటన

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 5: మండల పరిధిలోని చాకర్లపల్లి గురువారం వైద్య బృంద పర్యటించింది. గ్రామానికి చెందిన బాలుడు విషజ్వరంతో మృతిచెందిన విషయం విదితమే. దీంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశా రు. జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశా రు. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టారు. సీజనల్ వ్యాధులపట్ల అవ గాహన కల్పించారు. అలాగే జిల్లా మలేరియా అధికారి కుళ్లాయప్ప బృందం గ్రామంలో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలను వివరించారు. పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి రమణయ్య, సిబ్బంది రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌ఓ జయలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

చిలమత్తూరు, సెప్టెంబరు 5: మండలంలోని వీరాపురం శివార్లలో పేకాడుతున్న వారిపై దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసిన ట్లు ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ గురువారం తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. వారిలో ముగ్గురు పట్టుబడగా, మరి కొంతమంది పారిపోయారన్నారు. ఈ దాడుల్లో రూ.11200ను, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు దున్నల మృతి

మడకశిర రూరల్, సెప్టెంబరు 5: మండలంలోని సిద్దిగిరి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం రైతు శ్రీనివాసరెడ్డి చెం దిన రెండు దున్నపోతులు విద్యుదాఘాతాకానికి గురై మృతిచెందా యి. శ్రీనివాసరెడ్డి చెందిన రెండు దున్నపోతులు గ్రామ సమీపం లో పుట్టక్కబావి మేత మేస్తూ పొరపాటున 33 కేవీ విద్యుత్ లైన్ స్టే వైరుకు తగిలాయి. ఆ స్టే వైర్‌లో విద్యుత్ సరఫరా ఉండడంతో విద్యుదాఘాతమై అక్కడిక్కడే మృతిచెందాయని రైతు కన్నీమున్నీరుగా విలపించారు. తనకు దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందన్నారు. పరిహారం అందించాలని కోరారు. ఈ సంఘనపై రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వినాయక మండపాలు సిద్ధం


సిద్ధం చేసిన వినాయక మండపాలు

హిందూపురం, సెప్టెంబరు 5 : వినాయక చవితిని పురస్కరించుకుని హిందూపురంలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలను సిద్ధం చేశా రు. గతంలో ఎన్నడూలేని విధంగా భారీ ఎత్తున విగ్రహాలు ఏర్పాటు చేయ నున్నారు. కరోనా తరువాత ఎక్కువ సంఖ్యలో విగ్రహాల ఏర్పాటు ఈసారి జరుగనున్నట్లు పోలీసుల వద్ద అనుమతులను బట్టి తెలుస్తోంది. ఒక్క హిందూపురం పట్టణంలోనే 200కుపైగా విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. అందుకు తగ్గట్టుగా మండపాలను సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని విగ్రహాలు మండపాలకు చేరగా మరికొన్ని విగ్రహాలు మండపాల్లోనే తయారు చేస్తున్నా రు. ఇక మిగిలిన విగ్రహాలు శుక్రవారం మండపాలకు చేరుతాయి. యువత చవితి వేడుకలకు సంబంధించి మండపాలవద్ద బిజీ బిజీగా గడుపుతున్నారు

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఉపాధ్యాయ దినోత్సవంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 5: దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందన్నారు. పట్టణంలోని ఉపాధ్యాయ భవన్‌లో గురువారం ఉపా ధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అలాంటి ఉపాధ్యాయులపై దేశంలోనే కక్ష కట్టిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అప్పట్లో జగన్ పేరే వినిపించేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యా యులను టార్గెట్ చేసి, వారిని చాలా ఇబ్బందులకు గురిచేసిన ఘనత దక్కిం చుకుందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదన్నారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. వెనుకబడిన మడకశిర ని యోజకవర్గంలోని పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు మీరు కృషి చేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల స మస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, గ్రామీణ ప్రాం తాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా సహకరించాలని కోరారు. కార్య క్రమంలో ఎంఈఓ శ్రీనివాసభాస్కర్, ఎంఈఓ-2 నరసింహమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కమీషనర్ రంగస్వామి, విశ్రాంత ఎంఈఓ గోపాల్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మనోహర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మార్చికి గృహనిర్మాణాలు పూర్తిచేయాలి

● హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 5: గృహలబ్ధిదారుల్లో 2025మార్చి ఆఖరుకు ఇంటి నిర్మాణాలు పూర్తిచేసిన వారికి మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులు అందుతాయని హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యా లయంలో పెనుకొండ నియోజకవర్గ గృహలబ్ధిదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో ఉన్న ఇళ్ల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు పెండింగ్ బిల్లు లపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పీడీ మాట్లాడుతూ... ఈ నెల 20న టాప్ పూర్తిచేసి బయటి ప్లాస్టింగ్‌లు, తలుపులు, కిటికీలు వేసిన వారికి రూ.25వేలు తక్షణం అందిస్తామని తెలిపారు. అలాగే వచ్చే యేడాది మార్చి నెలాఖరుకు ఇంటి నిర్మాణం పూర్తిచేసిన వారికి రూ.లక్ష అంది స్తామన్నారు. తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శివశంకరప్ప, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య, నాయకులు చిన్నవెంకటరా ముడు, శ్రీరాములు, సిద్దయ్య, రామలింగ, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

'వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి'

గోరంట్ల, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయని కాంగ్రెస్ పార్టీ పెనుకొండ అసెంబ్లీ ఇన్‌చార్జ్ నరసింహులు పేర్కొన్నారు. లక్షల ఎకరాల్లో పంట నష్టం, ఆస్తి నష్టం జరగడంతో జాతీయ విపత్తుగా కేంద్రం ప్రటించాలని ఆయన గురువారం ఓ ప్రకటనలో కోరారు. వరదల వలన వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రాణ నష్టం జరిగిందని వెంటనే కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి జాతీయ విపత్తుగా పరిగణించాలన్నారు.

అసైన్డ్ భూముల సమస్య పరిష్కరించాలి

పెనుకొండ, సెప్టెంబరు 5: మండలంలోని ప్రతి గ్రామంలోనూ పెండింగ్‌లో ఉన్న ఎస్సీల అసైన్డ్ భూములను తక్షణం పరిష్కారం చేసి ఆ యా కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ విభాగం జిల్లా చె ర్మన్ కదిరప్ప కోరారు. సభ్యులతోకలిసి ఆయన గురువారం స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రతి గ్రామంలో శ్మశానానికి మూడెకరాలు కేటాయించాలని కోరారు. అ క్కడే ఉన్న ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ శ్రీధర్‌ను సత్కరించారు

17లోగా ప్రతి వాడలో వీధి దీపాలు వెలగాలి : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, సెప్టెంబరు 5 : గ్రామాల్లో ఈనెల 17వతేదీ లోగా వాడవాడలా వీధిదీపాలు వెలగాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికా రులను ఆదేశించారు. చీకటి లేని గ్రామాలుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా అందరం సమన్వయంతో పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీ డీఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లోని ప్రతి కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రజలకు చీకటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంపీడీఓలదే అన్నారు. పంచాయతీ స్థాయి అధికారులతో సమ న్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుం డా ఇప్పటి నుంచే అన్ని చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఐదు మండలాల ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా శిబిరాన్ని సందర్శించిన తహసీల్దార్

పావగడ, సెప్టెంబరు 5 : తాలూకాలు ఏర్పాటుచేసి సోలార్ పార్క్ లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని 15రోజులుగా బీఎస్పీ ఆధ్వర్యం లో చేపట్టిన ధర్నా శిబిరాన్ని గురువారం తహసీల్దార్ వరదరాజు సం దర్శించారు. నాయకులతో మాట్లాడారు. సోలార్ పార్కుకు భూములిచ్చిన రైతు కుటుంబాలతో పాటు స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ, ఇతర సభ్యులు ధర్నా విరమించారు. ఈఓ జానకి రామ్, నరసింహమూర్తి, కృష్ణమూర్తి, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

హిందూపురం, సెప్టెంబరు 5: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుని సొంత గ్రామానికి పేరు తీసుకురావాలని అబ్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు అన్నారు. మండలంలోని చౌళూరు ఉన్నత పాఠశాల లో గురువారం విద్యార్థులకు జనసేన నాయకులు నోటుపుస్తకాలు, పెన్ను లు, అట్టలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా సీఐ హాజరయ్యారు. జన సేన నాయకులు సోము, అశ్వత్థ, ఆటోరవి, చిరంజీవి పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా అందని జీతాలు

విధులను బహిష్కరించి పారిశుధ్య కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


ఆసుపత్రిలో కదలని చెత్తాచెదారం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 5: పురంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికులు నాలుగు నెలలుగా జీతాలు అందకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. పనులు చేసి పస్తులుం డాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం ప్రభు త్వాసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 26 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వారు గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో పనులు బహిష్కరించి ని రసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాలుగు నెలలుగా ఏజెన్సీ వారు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింద ని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల యూనిఫారం కుట్టుకూలీ కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నామన్నారు. పండగపూట కూడా పస్తులు ఉండాల్సి వస్తుందే మో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు కడుపునిండా భోజనం కూ డా పెట్టలేకపోతే ఎందుకు పనులు చేయాలని నిలదీస్తున్నారు. దీంతో రోజు వేయి మంది దాకా ఓపి ఉండే ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. టాయిలెట్లు, బాత్‌రూంలు దుర్గంధభరితమయ్యాయి. చెత్తాచెదా రం ఎక్కడిదక్కడ పేరుకుపోయింది. నాలుగు నెలల జీతాలు ఇస్తేనే కానీ విధుల్లోకి వెళ్లమని వారు ఖరాకండిగా చెబుతున్నారు. ఏజెన్సీ వారు ఈ రోజు, రేపు అని కాలం గడుపుతున్నారని దీంతో విసుగు చెంది పనులు నిలిపివేసి నిరసన చేస్తున్నట్లు పారిశుధ్య కార్మికులు అంటున్నారు.

నేడు జీతాలు ఇస్తామన్నారు

ఏజెన్సీ వారితో మాట్లాడాము. పారిశుధ్య కార్మికులకు శుక్రవారం ఉదయానికల్లా జీతాలు వేస్తామని తెలిపారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- రోహిల్, ఆసుపత్రి సూపరింటెండెంట్

మండపాలకు అనుమతి తప్పనిసరి: సీఐ

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 5 : వినాయక మండ పాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ రాఘవన్ తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డారు. వాడల్లో స్థానికు ల సమ్మతితో పార్టీలకతీతంగా వినాయక ఉత్సవాలను జరుపు కోవాలన్నా రు. బహిరంగ ప్రదేశాల్లోనే మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. శబ్దకా లుష్యం లేకుండా చూడాలన్నారు. శాంతిభద్రలకు విఘాతం కలుగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిమజ్జనం చేయాలన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ శంకర్, ఎస్ఐ రమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అవోపా నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 5: పట్టణంలోని వాసవీ ఆలయంలో ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫిషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో 250 మట్టి వినాయక ప్రతిమలను గురువారం పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి అవోపా జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి జయంతి సత్యరామ్, జిల్లా మాజీ అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు, ముఖ్య అతిథులు గా హాజరైయ్యారు. అవోప నాయకులు సుకుమార్‌గుప్త ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను అన్నివర్గాల ప్రజలకు అందించా రు. కాలుష్య నివారణ కోసం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీకే రాజేష్, రత్నయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ గండికి మరమ్మతులు


పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 5 : జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హం ద్రీనీవా కాలువ ద్వారా గొ ల్లపల్లి రిజర్వాయర్‌కు నీ రు విడుదల చేయడంతో హంద్రీనీవా కాలువ గం డికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని టీడీపీ నాయకుడు వెంక టేశ్వర్‌రావు హెచ్‌ఎన్ఎస్ అధికారులకు సూచించారు. మండలంలోని కోనాపురం సమీపంలో మడకశిర బ్రాంచ్ కెనాల్ ఎల్-5 వద్ద వైసీపీ పాలన లో హంద్రీనీవా కాలువకు పడిన గండి టీడీపీ నాయకులు, హెచ్‌ఎన్ఎస్ అధికారులు గురువారం పరిశీలించారు. గండిపడిన ప్రదేశం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో 2023లో బీఎల్ఆర్ ప్రాజెక్ట్‌వారు నాశిరకంగా పనులు చేయడంతో హంద్రీనీవా కాలుకు గం డిపడిందన్నారు. రైతు పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు.. కాలువ గండి మరమ్మతులకు రూ.9లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువుకు నీరంది స్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ డీఈ రామచంద్రమూర్తి, ఏఈ చౌడయ్య, నాయకులు మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, ప్రభాస్, త్రివేంద్ర, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే


సత్యసాయి కళాశాలలో విద్యార్థులతో ఛైర్మన్ వెంకటకృష్ణకిషోర్

పెనుకొండ, సెప్టెంబరు 5 : స్థానిక సత్యసాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్‌డే, ఉపాధ్యాయ దినోత్సవా లను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె వెంకటకృష్ణకిషోర్ హాజరయ్యారు. రాధా కృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ పరిధిలో జరిగిన సాఫ్ట్‌బాల్, స్పోర్ట్స్‌లో వివిధ విభా గాల్లో ప్రతిభ చూపిన సత్యసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు వెంకట కృష్ణ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఏఓ కేశవయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ నరసింహరావు, అధ్యాపకులు హాజరయ్యారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం


విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 5: ఏపీటీఎఫ్ సోమం దేపల్లి మండలం కమిటీ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులైన కిష్టప్ప, వెంకటేశ్, ఆదినారాయణను గురువారం ఘనంగా సన్మానించారు. గురుపూ జోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహిం చిన కార్యక్రమంలో స్టేట్ మాజీకౌన్సిలర్ జవాజీనాగరాజు, మండల గౌరవా ధ్యక్షుడు దస్తగిరి, అధ్యక్షుడు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, తదితరులు పాల్గొన్నారు.


పురంలో మొక్కలు అందిస్తున్న పాంచజన్య యాజమాన్యం


ఉషోదయలో సాంస్కృతిక కార్యక్రమాలు


గోరంట్లలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భక్తవత్సలం


పెనుకొండ బాలికోన్నత పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

సమాజం బాగుండాలంటే యువత బాగుండాలని, అలాంటి యువతను విద్యార్థి దశనుంచే సన్మార్గంలో పెట్టేవారు ఉపాధ్యాయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పలు పాఠశాలలు, కళాశాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిం చారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పలు పాఠశాలల్లో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


రేకులకుంట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం


పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....


శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు


అగళి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం


పావగడలో జ్యోతి వెలిగిస్తున్న తహసీల్దార్ చిత్తయ్యపూజార్, రాజేష్


సోమందేపల్లిలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం